క్లుప్తంగా

కాలిన గాయాలపై పసుపు, సిరా రాయొద్దు



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు ముద్దాడ శ్రావణి

విజయనగరం ఫోర్ట్: కాలిన గాయాలపై పసుపు, సిరా వేయవద్దని, అలా వేస్తే చర్మం తన సహజ గుణాన్ని కోల్పోతుందని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ముద్దాడ శ్రావణి తెలిపారు. స్థానిక దాసన్నపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గ్రామీణ వైద్యులకు వైద్య విజ్ఞానంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలిన గాయాలపై మంట తగ్గేవరకు చల్లని నీరు పోయాలని తెలిపారు. ఆ తర్వాత దగ్గరలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి, చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, కార్యదర్శి గద్దె చిరంజీవి, జిల్లా అధ్యక్షులు కోట్ల పైడిరాజు, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం ఉపాధ్యక్షుడిగా రమణ



ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని బూరాడపేటకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మక్కువ రమణ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని వి-కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, గౌరవాధ్యక్షుడు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణ స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

గుర్ల: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ వి.నారాయణమ్మ అన్నారు. మండలంలోని కెల్ల గెడ్డలో కెల్ల గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆక్రమించడడంతో రెవెన్యూ అధికారులు మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కెల్ల రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 332 పరిధిలోని ప్రభుత్వ భూమిలో సుమారుగా 30 సెంట్లు జేసీబీతో చదును చేసి ఆక్రమించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో ఆక్రమణ స్థలంలో బోర్డును వీఆర్వో రఘు ఏర్పాటు చేశారు.

బహిరంగ హెచ్చరిక నోటీసు

యిందుమూలంగా యావన్మందికి తెలియ చేయునది నా క్లయింట్ విశాఖపట్నం జిల్లా దొండపర్తి, డోర్.నెం. 46-13-34 కాపురస్తులు కాళ్ళ మల్లయ్యనాయుడు గారి భార్య కాళ్ళ వాహిని యిచ్చిన నోటీసు మేరకు నా క్లయింట్ విజయనగరం సంతపేట, ఉల్లివీధి కాపురస్తులు నామాల సర్వేశ్వరరావు నామాల గిరికుమారిల రెండవ సంతానంగాను, ఎస్సెంటి సునీత గారికి చెల్లియును, మధు నాగిని, నామాల సంతోష్ గార్లకు అక్కయును అయి ఉండి, సదరు నామాల సర్వేశ్వరరావు, నామాల గిరి కుమారిల సంతానమై ఉండి, ఇక 4 గురు వీరికి వారసులై ఉన్నారు. సదరు నా క్లయింట్ తల్లిదండ్రులకు, వారికి వారసత్వాన సంక్రమించిన స్థిరాస్తుల భూములు, భవనాలు విజయనగరం వివిధ చోట్ల ఉన్న సదరాస్తులపై నా క్లయింట్‌నకు 1/6వ వంతు హక్కు ఉన్నదనియు, సదరు ఆస్తులను మిగిలిన వారసులు నా క్లయింట్ అనుమతి లేరా నా క్లయింట్‌నకు తెలియకుండా ఇతరులకు అన్యాక్రాంతం చేయుచున్నట్లు తెలియవచ్చినది గాన, సదరు ఆస్తులకు సంబంధించి ఎవరైనా ఎట్టి ఆర్థిక లావాదేవీలు, కార్యకలాపాలు, చేపట్టిన అవి చెల్లవనియు నా క్లయింట్‌ను బంధింపజాలవనియు నా క్లయింట్ తల్లిదండ్రుల ఆస్తులపై నా క్లయింట్‌నకు 1/6 వంతు హక్కు భాగం ఉన్నందున సదరు ఆస్తులకు సంబంధించి నా క్లయింట్ అనుమతి తప్పనిసరి అయి ఉన్నందు, ఎవరైనా నా క్లయింట్ అనుమతి లేకుండా వ్యవహారములు జరిపిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని యిందుమూలంగా తెలియపరచడమైనది.

నా క్లయింట్ తండ్రి గారైన నామాల సర్వేశ్వరరావు S/o లేటు సూర్యనారాయణ పేర అతనికి ఆయన తల్లితండ్రి నుండి సంక్రమించిన విజయనగరం జిల్లా విజయనగరం MC. BIT భాగా నెం. 34లో చేరిన సర్వే నెంబర్లు 38, 38/10, 39-1, 39-2లో పల్లం భూములు, విజయనగరం రంగిరీజు వీధి లోని ఆర్‌సిసి బిల్డింగ్, సిమెంట్ మ్యాల్ రోడ్డులోని ఎరుకల వీధిలోని నివేశన స్థలం, ఉల్లివీధి సంతపేటలోని రెండు ఆర్‌సిసి ఇల్లులున్నూ మరియు నా క్లయింట్ తల్లిగారు నామాల గిరికుమారికి వారసత్వా లభించిన 1 టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న నివేశన స్థలం ప్రస్తుతానికి యెరుకలో ఉన్న ఆస్తులు అయి, ఇంకేమి తెలియరాని వివిధ ఆస్తులపైనను ఎవరైనా ఎట్టి ఆర్థిక కార్యకలాపాలు, నిర్వహించినా అవి చెల్లనేరవని ఇందుమూలంగా బహిరంగంగా హెచ్చరించడమైనది.

కదిరి రాము, అడ్వకేట్
ఎల్.బి.కాలనీ, విశాఖపట్నం. సెల్: 9848535887

గాంధీ పార్కు కళ తప్పింది. విజయనగరం జిల్లా కేంద్రంలోని ఈ పార్కు ఒకప్పుడు ఆహ్లాదానికి మారుపేరు. ఇప్పుడు అటువైపు కన్నెత్తి కూడా చూసేందుకు జనం భయపడుతున్నారు. అంత అధ్వానంగా తయారైంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనీస అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో పార్కు పరిసరాల్లో ఎక్కడ చూసినా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారమే కనిపిస్తున్నాయి. మరోవైపు విరిగిన కుర్చీలు, బెంచీలు, చిన్నారుల ఆటవస్తువులు పార్కు ప్రగతిపై పాలకుల నిర్లక్ష్యానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇప్పటికైనా పార్కును ఆధునీకరించి, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



సందడి వాతావరణం లేని గాంధీ పార్కు లైబ్రరీ

అభివృద్ధి కరువై.. ఆహ్లాదం కనుమరుగై!





పార్కులో విరిగిన బెంచీలు





పార్కులో ధ్వంసమైన చిన్నారుల ఆట వస్తువులు



పిచ్చిమొక్కలతో నిండిన పార్కు పరిసరాలు



అభివృద్ధికి నోచుకోని పార్కు లోపలి బుద్ధుడి విగ్రహం పరిసరాలు



పార్కు లోపల చెత్త ఇలా..

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



విజయనగరం జిల్లా కేంద్రంలోని పాలాస్పత్రి దగ్గరలోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా కనిపిస్తోంది. చేతికి అందినంత ఎత్తులో ఉండడంతో వాహనాలు ఏవైనా అదుపుతప్పి అటువైపుగా వెళితే పరిస్థితి ఏంటి అని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నిరసన



తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఇదే విషయమై వారు భోగాపురం తహసీల్దారు కార్యాలయం ముందు మంగళవారం నిరసన చేపట్టారు. చిరుద్యోగులమైన తమను నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వానికి ఎంతమాత్రం తగదని నినదించారు. చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నామని, తమలాంటి వారికి పథకాలు దూరం చేస్తే ఎలా బతకాలని, తమ పిల్లల భవిష్యత్ ఏం కావాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమను సూపర్ సిక్స్ పథకాలకు అర్హులని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు సూర్యనారాయణ, అంగన్‌వాడీ సంఘం నాయకులు ఉమామహేశ్వరి, మహాలక్ష్మి, సత్యకళ, అనిత, తదితరులు పాల్గొన్నారు. – భోగాపురం

పంచాయతీ తీర్మానం మేరకే షెడ్డు తొలగించాం



మాట్లాడుతున్న రఘు, అప్పారావు

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ గ్రామంలో శ్మశానంలోని షెడ్డును ప్రజలందరి అభీష్టం మేరకే తొలగించామని గ్రామస్తులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన పలువురు ఆ గ్రామంలోని వివాదాస్పదమైన శ్మశానవాటికను మంగళవారం సందర్శించారు. గ్రామాభివృద్ధి పనుల్లో భాగంగానే వాస్తుకు విరుద్ధంగా శిథిలమై ఉన్న షెడ్డును తొలగించడం జరిగిందన్నారు. షెడ్ వాస్తుకు విరుద్ధం కావడం వల్ల గ్రామంలో అధిక మరణాలు చోటుచేసుకుంటున్నాయన్న అభిప్రాయంతో షెడ్డు కూల్చేయడం జరిగిందన్నారు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అభివృద్ధి చూసి ఓర్వలేకనే ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. విచారణకు వచ్చిన ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ భూషణరావు కూడా గోప్యంగా వచ్చి ప్రజల నుంచి ఎటువంటి అభిప్రాయం సేకరించకుండానే వెళ్లారన్నారు. అధికారులు వాస్తవాలు గ్రహించి, నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల రఘు, వైఎస్సార్‌సీపీ నాయకులు దేబార్కి అప్పారావు, బడి నరసయ్య, పతివాడ తాతినాయుడు, కోట్ల సత్యం, కోట్ల కృష్ణ, అల్లాడ త్రినాధరావు, కోట్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ 'ఉపాధి' నిధుల విడుదలకు చొరవచూపాలి



లేఖ విడుదల చేస్తున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ తదితరులు

- డిప్యూటీ సీఎం పవన్‌కు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ లేఖ

విజయనగరం గంటస్తంభం: పెండింగ్ ఉపాధి హామీ పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ కోరారు. ఇదే విషయమై ఆయన డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్‌కు లేఖ రాశారు. ఇదే లేఖను జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి జరగాలంటే ఉపాధి హామీ పథకం కింద చేసిన ప్రతి పనికీ వెంటనే నిధులు విడుదల కావాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో గ్రామీణాభివృద్ధికి పల్లెపండగ పేరుతో ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మెటీరియల్ సరఫరాదారులతో(వెండర్ స్కీమ్) అభివృద్ధి పనులు చేయించి, గడిచిన ఆరు నెలలుగా వాటికి నిధులు విడుదల చేయకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. రాష్ట్రంలో రూ.2090 కోట్ల రూపాయల బిల్లులు నేటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రూ.197 కోట్లు, ప్రకాశం జిల్లాలో రూ.122 కోట్లు, తిరుపతి జిల్లాలో రూ.118 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.113 కోట్లు, విజయనగరం జిల్లాలో రూ.111 కోట్లు అత్యధికంగా చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేశారని వారంతా ఇప్పుడు వడ్డీలు కట్టుకోలేకపోతున్నారన్నారు. తక్షణమే నిధుల విడుదలకు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లకు లేఖలు రాశామన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, అప్పారావు, రాజారావు, రమేష్, రాంమోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ అభినందన సభ



చిట్టిబాబును సన్మానిస్తున్న రిటైర్డ్ ఐజీ రంగారావు, తదితరులు

విజయనగరం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రాజ్యాంగ విధాన పరిషత్ సభ్యుడు, భారతరత్న సి.సుబ్రహ్మణ్యం పేరిట నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా అందించిన జాతీయ అవార్డును జిల్లాకు చెందిన చిట్టిబాబు అందుకోవడం అభినందనీయమని రిటైర్డ్ ఐజీ ఎల్‌కేవీ రంగారావు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పౌర సన్మాన వేదిక, దళిత బహుజన శ్రామిక యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ మంగళవారం ఏర్పాటు చేసి, చిట్టిబాబును సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చిట్టిబాబు తనను తాను చెక్కుకున్న శిల్పి అని ప్రశంసించారు. సామాజిక ఉద్యమాల్లో అనేక అవరోధాలు ఎదుర్కొంటూ రాజ్యాంగ విలువలకు లోబడి బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయడం స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో వివక్షకు గురవుతున్న ప్రజల పక్షాన వివక్షత లేని సమాజం వైపు పయనించే అతికొద్ది మంది నాయకులలో చిట్టిబాబు ప్రముఖుడని, అందుకే ఆ అవార్డు ఆయనను వెతుక్కుంటూ వచ్చిందన్నారు. అనంతరం తెలుగులో ప్రచురించిన భారత రాజ్యాంగ పుస్తకాన్ని రిటైర్డ్ ఐజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అంతకుముందు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు సీనియర్ సిటిజన్‌లకు, దివ్యాంగులకు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పలువురు మాట్లాడుతూ యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



విజయనగరం జిల్లా కేంద్రంలోని చదురుగుడి..పైడితల్లి ఆలయ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం మహిళలు చేపట్టిన కోలాటం ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. విజయనగరం వాస్తవ్యులైన శ్రీపైడిమాంబ కోలాటం కృష్ణవేణి బృందం(20 మంది సభ్యులు) వారిచే ఈ ప్రదర్శన ఇవ్వడం జరిగింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

కనీస వేతనాలు ఇవ్వాలి



ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: కనీస వేతనాలు ఇవ్వాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజును మున్సిపల్ కార్మికులు కోరారు. ఇదే విషయమై వారు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే అదితిని, నగరపాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ సప్లయి, పర్యావరణ విభాగాల్లో పనిచేస్తున్న ఆప్కాస్, థర్డ్ పార్టీ కార్మికులకు జీవో నంబరు 36, 1615 ప్రకారం కనీస వేతనం 21,000.. టెక్నికల్ వేతనం 24,500 చెల్లించాలని కోరారు. ఆప్కాస్‌లోని ఇంజినీరింగ్ సిబ్బందికి కూడా పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతనాలు పెరగకపోవడంతో ఒక్కో కార్మికుడు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నష్టపోయారన్నారు. థర్డ్‌పార్టీ కార్మికులకు రెండు మూడు నెలలుగా చెల్లించని బకాయి వేతనాలు చెల్లించాలని యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు తెలిపారు. ఆప్కాస్ కార్మికులతో సమానంగా వేతనాలు ప్రతినెలా 10వ తేదీ లోపు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ కట్టని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. లేబర్ హాలిడేస్, సిక్, క్యాజువల్ లీవులు ఇవ్వాలని కోరారు. 2024 రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ఇంజినీరింగ్ అండ్ నాన్ పీహెచ్ కార్మికులందరికీ సంక్రాంతి కానుకగా రూ.1000 ఇవ్వాలి. దశల వారీగా మొత్తం కార్మికులను సర్వీస్ ప్రామాణికంగా క్రమబద్ధీకరించాలి. సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రామునాయుడు, ఎస్.రాజు, భాస్కర్‌రావు, అర్జున్, నారాయణరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువులో విహరించిన కోటసత్తెమ్మ



పెద్దచెరువులో అమ్మవారి తెప్పోత్సవం



కోటసత్తెమ్మకు ఘటాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

విజయనగరం టౌన్: స్థానిక రామానాయుడు రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీకోటసత్తెమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు పెద్దచెరువులో విహరించారు. తొలుత అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులు చేసి భాజాభజంత్రీలు, మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం చెరువులో మూడుసార్లు అమ్మవారు విహరించిన తర్వాత ఆలయానికి తోడ్కొని వచ్చారు. చివరిగా అమ్మవారికి ఊంజల్ సేవ చేశారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త ఒబ్బిలిశెట్టి వెంకటరమణమూర్తి, భారతి దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏడుకొండలు, పేర్ల సీతారామయ్యశెట్టి, కోటేశ్వరరావు, నారాయణరావు, త్రినాథ్‌లతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు. తల్లీ చల్లంగా చూడమ్మా అని వేడుకున్నారు.